# సరదాగా మరికొంతసేపు

## పదిన్నొక్క పి.జి. వుడ్‌హౌస్ కథలు




అనుసృజన

గబ్బిట కృష్ణమోహన్



**SARADAGA MARIKONTHASEPU** 11 PG Wodehouse Stories

– G. Krsihna Mohan

ప్రచురణ నెం. : 2015/108

ప్రతులు : 1000

ప్రథమ ముద్రణ : డిసెంబర్, 2015 **వెల : 165/-**

ఆంగ్లమూలం : **PG Wodehouse** Reproduced by permission of the Estate of PG Woodhouse c/o M/s Rogers, Coleridge & White Ltd 20, Powis Mews, London W11 1JN

ముఖచిత్రం, బొమ్మలు : రాంపా

(C) **గబ్బిట కృష్ణమోహన్**

105, Srinilaya Sagar View, 6-3-1099/1/9 Somajiguda, Hyderabad – 500 082,

Ph : 66105247 Cell : 9391015247 e – mail : mohangabbita@gmail.com

ప్రతులకు:

**నవచేతన పబ్లిషింగ్ హౌస్**

గరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్) జి.ఎస్.ఐ. (పోస్ట్)

హైదరాబాద్ – 068. తెలంగాణ. ఫోన్స్ : 24224453/54

E-mail : navachethanaph@gmail.com

**నవచేతన బుక్ హౌస్**

ఆబిడ్స్, సుల్తాన్‌బజార్, యూసఫ్‌గూడ, కూకట్‌పల్లి, బండ్లగూడ(నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం.

ప్రజాశక్తి బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు

నవతెలంగాణ బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు

**హెచ్చరిక:** ఈ పుస్తకంలో ఏ భాగాన్ని కూడా పూర్తిగా గానీ, కొంతగానీ కాపీరైట్ హోల్డరు & ప్రచురణ కర్తల నుండి ముందుగా రాతమూలకంగా అనుమతి పొందకుండా ఏ రూపంగా వాడుకున్నా కాపీరైట్ చట్టరీత్యా నేరం.

ముద్రణ : నవచేతన విజ్ఞాన సమితి ముద్రణాలయం,

# ముందుమాట

వుడ్‌హౌస్ ఎవరూ?

రావుబహదూర్ సోమేశ్వరరావు ఎవరూ?

మధ్యలో గబ్బిట కృష్ణమోహన్ ఎవరూ?

ఏవిటీ వీరి సంబంధం?

★★★

తొంభైమూడేళ్ళు జీవించి, అందులో డెబ్బైరెండేళ్ళ పాటు రచనా వ్యాసంగం సాగించి 1975లో వెళ్ళిపోయిన మహానుభావుడు పి.జి. వుడ్‌హౌస్.

ఇంగ్లాండు మనిషి. అమెరికా అంటే అభిమానం. "పన్ను" బాధల పుణ్యమా అని ఫ్రాన్సులో ఓ పదేళ్ళు వున్నాడు. రెండో ప్రపంచ యుద్ధంలో జర్మన్లకు చిక్కడిపోయి ఓ ఏడాదిపాటు వారి ఆతిధ్యం స్వీకరించాడు. పొరపాటునో, గ్రహపాటునో ఆ జర్మనీవారి రేడియోలో తన బాణీ ప్రసంగాలు ఓ అరడజను చేసి తన స్వదేశీయుల అసహనానికీ, ఆగ్రహానికీ గురి అయ్యాడు. దాని పుణ్యమా అని మళ్ళీ ఇంగ్లాడులో అడుగు పెట్టకుండా ఓ ముప్పై ఏళ్ళపాటు అమెరికాలో నివసించి, పౌరసత్వం పొంది అక్కడే తనువు చాలించాడు. ఆగ్రహాలు సద్దుమణిగాక మరణానికి కొద్దినెలలు ముందు ఆంగ్ల ప్రభుత్వంవారి నైట్‌హుడ్ పొంది సర్ వుడ్‌హౌస్ అయ్యాడు.

★★★

వుడ్‌హౌస్ ఏమి రాశాడూ?

చాలా రాశాడు. పుంఖానుపుంఖాలుగా రాశాడు. జబ్బసత్తువ వున్న రోజుల్లో మూడు నెలలకో నవల రాశాడు. ఆ సత్తువ తగ్గినపుడు ఆరునెలలకో నవల.

నవలలు, కథాసంకలనాలు కలిసి తొంభై రెండు పుస్తకాలు. నలభై మ్యూజికల్ కామెడీల లిరిక్సుకి సహరచయిత. ఇవికాక ఉత్తరాలు, జ్ఞాపకాలు, వ్యాసాలు .. ఎన్నో రాశాడు. కానీ ఏది రాసినా – ఎంత వేగంగా రాసినా – కృషి చేసి రాశాడు. నాణ్యతను వదలలేదు. విజయవంతంగా రాశాడు. "మనకాలపు ఉత్తమ రచయిత" అన్నాడో సమకాలీన రచయిత – 1930లో.

నిజానికి ఆయన ఏమి రాశాడూ?

సీరియస్ సాహిత్యం రాయలేదు. సామాజిక అంశాలతో రాయలేదు. వ్యంగ్య విమర్శకూ పూనుకోలేదు. పోనీ హాస్యరచనలు అందామా – అదీకాదు. "ఫార్సు" రాశాడు అని తేల్చారు విశ్లేషకులు. నా వరకూ నాకు ఆయన రాసినది రేలంగి, పద్మనాభంల బాణీల మేలు కలయిక అనిపిస్తుంది.

★★★

వుడ్‌హౌస్ రచనలు పాఠకులను ఆకట్టుకొన్నాయన్నది నిజం, వాస్తవం. రాసి వందేళ్ళు దాటినా, రాసినాయన వెళ్ళిపోయి నలభై ఏళ్ళు దాటినా అతనిని చదివేవాళ్ళు ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటికీ ఉన్నారు. ఇంగ్లీషులోనే గాకుండా తమతమ సొంత భాషలలో అనువ దించుకుని చదివేవాళ్ళూ వేలకొద్దీ ఉన్నారు. మన తెలుగులో బాపూరమణల దగ్గిర్నించి గబ్బిట కృష్ణమోహన్ వరకూ ఆయన అభిమానులు అసంఖ్యాకం.

ఊరికే అభిమానించి ఊరుకోకుండా వుడ్‌హౌస్‌ను అనుసృజించి పెడుతున్నారు గబ్బిట.

★★★

"సరదాగా మరికొంతసేపు" అన్న వుడ్‌హౌస్ అనుసృజనలో మొత్తం పదకొండు కథలు ఉన్నాయి. అందులో "సినిమారంగం"కు చెందినవి నాలుగు.

వుడ్‌హౌస్ అభిమానులంతా తమ అభిప్రాయాలను కలగలిపి ఆయన కథల్లో తలమానికంగా ఎన్నుకొన్న "అంకుల్ ఫ్రెడ్ ఫ్లిట్స్ బై" అన్న 1936 నాటి కథ ఈ సంపుటిలో "సోంబాబాయి వలస కాపురం" గా మొట్టమొదట కనిపిస్తుంది. మాతృకలోని అంకుల్ ఫ్రెడ్ అనుసృజనలో రావుబహదూర్ సోమేశ్వరరావుగా "అవతారం" ఎత్తుతాడు. తన అబ్బాయి అవతారంతో కలిసి తన చిన్ననాటి ఊరు కుందేరుకు విలాసంగా వెళ్ళి ఇరవై పేజీలూ, ఒక గంటా వ్యవధిలో "తన లౌక్యాన్నీ, బుద్ధికుశలతని, సమయస్ఫూర్తిని, చాకచక్యాన్ని" అలవోకగా ప్రదర్శించి పాఠకులను అలరిస్తాడు.

మొదటి భాగంలోని ఏడు కథల్లో నాలుగింట శశిరేఖ ముఖ్య పాత్రధారి. ఆమె తల్లి మహా రచయిత్రి ప్రసూనాంబ విస్మరించలేని కథావ్యక్తి. పెరిగి పెద్దయ్యాక సోంబాబాయి అంత గొప్పమనిషిగా రూపొందగల ప్రామిస్ వున్న శశిరేఖ తాను ఇష్టపడే నరహరిని కాకుండా తల్లి సూచించి బాధించే వర్ధమాన రాజకీయ నాయకుడు ప్రసాద్, రచయితగా అపుడపుడే నిలదొక్కుకొంటున్న గంపా శేఖర్, ఏకపక్ష ఆరాధకుడు దూడల దివాకర్, అవ్యాజ వ్యామోహి శేషగిరులను ఎంతో చాకచక్యంతో "తెల్లవారుఝాము పాలబండి"లు ఎక్కించిన వైనం కనిపిస్తుంది ఈ నాలుగు కథల్లో.

"విధి, "అదృష్టం" అన్న కథల్లో పాత్రలు వేరైనా వాటిల్లోని అనూరాధ, సరిత – శశిరేఖకు కజిన్లే. తండ్రి గోవర్ధనరావూ, జమీందారు నీలకంఠం – ఒకే తాను ముక్కలే. వెరసి ఈ రెండు కథలూ "తాత్విక దృష్టితో" చూస్తే మిగిలిన నాలుగు కథలకు దగ్గరి బంధువులే.

సినిమారంగపు నాలుగు కథల్లో రెండింట నరసరాజు, రాగిణిల ఉదంతాలు కనిపిస్తాయి. మరో కథ "కోతిచేష్టలు"లో వీళ్ళిద్దరూ పేర్లు మార్చుకొని కనకరాజు, సుభాషిణి అయ్యారా అనిపిస్తుంది. నాలుగోకథ "మీనా దేశ్ పాండే తారాపథం" మొట్టమొదటి సోంబాబాయి కథలాగా మిగిలినవాటికి వేటికీ చెందని విలక్షణత గలది.

★★★

పరిమితుల దృష్ట్యా చూస్తే  అనువాదం సొంత రచన కన్న కష్టమైనది.

అనుసృజన అనువాదం కన్న మరింత మరింత కష్టమైన పని. వుడ్‌హౌస్  కథల నేపథ్యం ఇంగ్లీషు గ్రామసీమలకూ, పట్టణాలకూ చెందినది. ఆయా రచనలను ఆంగ్లంలోనే చదువుకునేవాళ్ళకి అది అవరోధం కాకపోవచ్చు. ఇంగ్లీషు రానివాళ్ళ కోసమే ఈ తెలుగు ప్రయత్నం అనుకుంటే – అలాంటి పాఠకులు ఆయా  పేర్లూ, ప్రాంతాలూ, ఆచార వ్యవహారాలతో మమైకం అయ్యే అవకాశం దాదాపు పూజ్యం. అందులోనూ ఆయా రచనలు హాస్యమూ, ఫార్సూ, శబ్ద అర్థాలంకారమయం అయినపుడు వాటిల్ని చదివే వాళ్ళకు అవి ఆకాశ పంచాంగాలు అయితీరుతాయి.

మరి వాటిల్ని అభిమానించి, వాటిల్ని తెలుగు మాత్రమే వచ్చినవాళ్ళకు తెలియ జెయ్యాలని తపించే వారికి ఏమన్నా మార్గాంతరం ఉందా?! ఉంది!!

అనుసృజన.

గబ్బిట కృష్ణమోహన్ గత ఐదారేళ్ళుగా ఈ మార్గాన వెడుతున్నారు. విజయయాత్ర చేస్తున్నారు. ఈ పరంపరలో సరికొత్త మైలురాయి "సరదాగా మరికొంతసేపు".

సోమేశ్వరరావు, గోవర్ధనరావు, గంపా శేఖర్, దూడల దివాకర్, శశిరేఖ, బండారు ప్రసూనాంబ, శేషగిరి, బాబ్జీ, అనూరాధ, శ్రీహరి, సరిత, జమీందార్ నీలకంఠం, నరసరాజు, కనకరాజు, రాగిణి, సుభాషిణి, రాజమాణిక్యం–ఉరఫ్–మీనా దేశ్‌పాండే – వీళ్ళ మాతృపాత్రలు ఆంగ్లదేశపు నేలకు చెందినవి అయినా, వీళ్ళంతా పదహారణాలు  తెలుగు మనుషులు. గబ్బిటగారు ప్రాణప్రతిష్ఠ చేసిన మన మనషులు.

కథల్లోని  "పానకుటీరాలు" మన సంస్కృతికి చెందినవి కాకపోయినా అనుసృజన నైపుణ్యమా అని పానకంలో యాలక పలుకుల్లానే ఉంటాయి.

"పెరట్లో హాయిగా కూర్చున్న  కోడిపెట్టల్ని అదిలిస్తే రెక్కలు టపటపలాడిస్తూ పరి గెత్తినట్టు ఆడవాళ్ళంతా బయటకి నడిచారు" (బుసబుసలు); "గుండెకు గాట్లుపడి ఆ గాట్ల లోంచి గాలి బయటకొస్తున్నట్టుగా ప్రసూనాంబగారు నిట్టూర్చారు" (విశ్రాంతి చికిత్స); "అప్పుడే గుడ్డులోంచి బయటపడి వృత్తిలో ఓనమాలు దిద్దుకొంటోన్న వడ్రంగిపిట్ట చేసే చప్పుడులా ఉందది" (తల్లిగారి ఘనసత్కారం); "అది విని దివాకర్ చెట్లలోంచి దూసుకుపోయే గాలిలా మూలిగాడు" (తల్లిగారి ఘనసత్కారం) – ఇలాంటి అనేకానేక పదబంధాలూ, వాక్యాలూ అపురూపమైన దేశవాళీతనంతో గుబాళిస్తాయి. అనుసృజనకు అర్థాలు చెపుతాయి.

మూలభాషలో వుడ్‌హౌస్‌గారు ఏమని ఉంటారా అన్న కుతూహలం కలిగిస్తాయి.

ఇవన్నీ ఒక ఎత్తు – కృష్ణమోహన్ "తలాడించేవాడి కథ"లోనూ, "మిస్ మీనా దేశ్‌పాండే తారాపథం"లోనూ చూపించిన ప్రతిభ అమోఘం; అద్వితీయం.

తలాడించే భాగోతుల నరసరాజుకు ప్రేమాయణం గుంటదారుల్లో పడ్డప్పుడు మంచి కిక్కిచ్చే దానికోసం మనసు వెంపర్లాడినపుడు – అవి మద్యపాన నిషేధపు మంచిరోజులు – తనకు తెలిసిన ప్రదేశానికి వెళ్ళి తలుపు తట్టి "ఎవరికి ఎవరూ  కాపలా  బంధాలన్నీ  నీకేలా" అంటూ కోడ్ పాట పాడతాడు. తలుపు తీసిన మనిషి "ఏం సినిమా?" అని

అడిగితే "ఇంటికి దీపం ఇల్లాలే" అని, "దాహమేస్తోంది" అంటాడు. ఇది చదివాక మన మనసుకు కిక్కూ ఎక్కుతుంది. ఇంకా కావాలని దాహమూ వేస్తుంది.

ఏకచిత్ర అగ్రతార మీనా దేశ్‌పాండేగారి మాతృపాత్ర ఆంగ్లభాషలో ఏవేం పాటలు గానించిందో తెలియదుగానీ మన రాజమాణిక్యం (ఉరఫ్ మీనా దేశ్‌పాండే) – "పులకించని మది పులకించు" దగ్గర మొదలుపెట్టి "కల నిజమాయెగా కోరిక తీరెగా" దాకా ఓప్పదీ ఇరవై పాటలు పాడేసి "భళిరా గబ్బిటా!" అని పాఠకులు వీరతాడు వేసేలా చేస్తుంది.

★★★

వుడ్‌హౌస్ రాసినది సీరియస్ సాహిత్యం గాకపోయినా దశాబ్దాల తరబడి, తరతరాల తరబడి పాఠకులను ఆకట్టుకొందన్న మాట నిజం.

ఏవిటా కారణం? ఏవిటా రహస్యం?

ఖచ్చితంగా చెప్పడం కష్టం.

ఎడ్వర్డియన్ యాసా, కవుల కొటేషన్లూ, అనేకానేక సాహితీ చమక్కులూ కలగలిపి తనదైన ఓ ప్రత్యేక భాషాశైలిని సృష్టించాడు వుడ్‌హౌస్. దాన్ని కామిక్ పొయెట్రీ అన్న వాళ్ళున్నారు. మ్యూజికల్ ప్రోజ్ అన్న వాళ్ళున్నారు. ఏదేమైనా భాష విషయంలో వుడ్‌హౌస్ రచనలు భాష పరిధుల్ని దాటుకుని వెళ్ళి కొత్త మైలురాళ్ళను పాతాయి అన్న విషయం దాదాపు అందరూ అంగీకరిస్తారు.

అయినా మూలప్రశ్న మరోరూపంలో మనల్ని వెంటాడుతూనే ఉంటుంది.

హాస్య, వ్యంగ్య, ఫార్సు రచనలకు కాలక్షేపమూ, ఉల్లాసమూ గలిగించడాన్ని మించిన పరమావధి ఉంటుందా?

దానికి రేలంగి సమాధానం చెప్పగలడు – పద్మనాభం చెప్పలేకపోయినా.

ఛార్లీ చాప్లినయితే ఢంకా బజాయించి, గుండెలు బద్దలుకొట్టి చెపుతాడు.

కానీ ఒక్కమాట.

వుడ్‌హౌస్ గురించి మాట్లాడుతూ "సాహితీ ప్రయోజనం" అంటూ వెళ్ళడం చాదస్తపు చర్చ అయి తీరుతుంది.

అయినా పుస్తకపు శీర్షికే ఆహ్వానిస్తోంది గదా:

"సరదాగా మరికొంతసేపు" వుడ్‌హౌస్‌తో గడపమని ...

ఇక ఆలస్యం ఎందుకూ – గబ్బిట వుడ్‌హౌస్ దగ్గరికి వెళదాం ..

న్యూఢిల్లీ –దాసరి అమరేంద్ర

24 అక్టోబరు 2015

## కృతజ్ఞతలు

పి.జి వుడ్‌హౌస్ రచనలని కొంతవరకైనా తెలుగు పాఠకులకు అందించాలనే ప్రయత్నంలో భాగమే ఈ 'సరదాగా మరికొంతసేపు' పుస్తకం. ఇది ఆరవది.

తెలుగు సేతకు అనుమతించిన కాపీరైట్ హోల్డర్స్ The Trustees of the Wodehouse Estates వారికి.

గతంలో ప్రచురించిన రెండు పుస్తకాల మాదిరిగానే ఈ సంపుటాన్ని ప్రచురిస్తున్న "నవచేతన పబ్లిషింగ్ హౌస్" యాజమాన్యానికి, సంపాదక వర్గానికి, సిబ్బందికి నా కృతజ్ఞతలు.

ముందు వచ్చిన రెండు కథా సంపుటాల లాగానే దీనికి కూడా ముఖచిత్రం, లోపలి బొమ్మలు వేసిన మిత్రులు రాంపాగారికి,

ఈ పుస్తకానికి అంకితం అందుకోడానికి అంగీకరించిన మరో వుడ్‌హౌస్ అభిమాని శ్రీ రావికొండలరావు గారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు.

ఎప్పటిలాగానే ఈ సంకలనాన్ని కూడా పాఠకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను...

అడగ్గానేన ముందుమాట యిస్తూ – 'గబ్బిట వుడ్‌హౌస్' అనడంలో దాసరి అమరేంద్ర గారికి కృతజ్ఞతలతో...

–గబ్బిట కృష్ణమోహన్

# ఇందులో...


1. సోంబాబాయి వలస కాపురం 13

2. బుసబుసలు 37

3. తల్లిగారి ఘనసత్కారం 60

4. శేషగిరి తంటాలు 85

5. విధి 104

6. అదృష్టం 124

7. విశ్రాంతి చికిత్స 141

సినిమా రంగం కథలు

1. కోతిచేష్టలు 163

2. తలాడించేవాడి కథ 182

3. బత్తాయి రసం 200

4. మీనా దేశ్‌పాండే తారపథం 218

# సోంబాబాయి వలస కాపురం

*'అంకుల్ డైనమైట్' (ఎమెస్కో ప్రచురణ, 2012) చదివిన పాఠకులకి ఈ కథలో ప్రధాన పాత్రలైన రావు బహదూర్ సోమేశ్వర్రావు, అవతారం పరిచయస్తులు. రా.బ. సోమేశ్వర్రావు తన లౌక్యాన్ని, బుద్ధికుశలతని, సమయ స్ఫూర్తిని, చాకచక్యాన్ని తెలిపేందుకు వివరాల్లోకి పోకుండా ఈ వృత్తాంతాన్ని అంకుల్ డైనమైట్‌లో టూకీగా సులోచనతో ప్రస్తావిస్తాడు.*

*ఈ కథకి మూలం 1936లో ప్రచురితమైన 'యంగ్ మెన్ ఇన్ స్పాట్స్' పుస్తకంలోని 'అంకుల్ ఫ్రెడ్ ఫ్లిట్స్ బై'. పి.జి. వుడ్‌హౌస్ రచనల్లో కొన్నింటిని ప్రత్యేకంగా విలక్షణమైన సంపుటిలో తేవాలన్న సంకల్పంతో ఒక ప్రచురణ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా వుడ్‌హౌస్ అభిమానుల అభిప్రాయం సేకరిస్తే అందరూ ముక్తకంఠంతో తమ ఫస్ట్ ఛాయిస్‌గా ఈ కథని ఎంచుకున్నారు. అందుకే 2000లో 'వాట్ హో!' పేరుతో వెలువడిన సంకలనంలో మొదటి కథగా అగ్ర తాంబూలం అందుకుంది. ఇక్కడా అంతే.*

*

కనకదుర్గా క్లబ్బులో తృప్తిగా భోజనం చేసిన తరవాత లోకనాథం, తన కూడా వచ్చిన గెస్టు ప్రశాంతంగా సిగరెట్టు ముట్టించుకునేందుకు అనువుగా జనం ఎక్కువుండని చిన్న రూములో కూచోపెట్టి వేరే చోట కబుర్లు జోరుగా నడిచినా ఎవరో ఒక ఆకతాయి మెంబరు వున్నట్టుండి ప్లేటులోంచి బజ్జీలు, పకోడీలు విసిరే ప్రమాదముందని చెప్పాడా గెస్టుకి. అర్థం చేసుకున్నట్టు తల వూపుతూ, ''వుడుకు రక్తం కాబోలు?'' అని అడిగాడా గెస్టు.

''మరే, వుడుకు రక్తమండి.''

''పాశవిక ప్రవృత్తి.''

''మీరన్నట్టు పాశవిక ప్రవృత్తే,'' లోకనాథం వొప్పుకున్నాడు. ''అలాంటివాళ్ళు చాలామంది వస్తుంటారిక్కడికి.''

''ఇప్పుడొచ్చే వ్యక్తి అలాంటివాడు కాదనిపిస్తోంది.''

''ఎవరు?''

ఆ పెద్దమనిషి తలుపు వంక చూపించాడు. ఖరీదైన సూటు వేసుకున్న కుర్రాడొకడు అప్పుడే లోపలికొస్తున్నాడు. ముఖం పాలిపోయి, కళ్ళు లోతుకు దిగి, హైరాన పడుతున్నట్టు వున్నాడు. అగ్గిపుల్ల నోట్లో పెట్టుకుని, సిగరెట్టు తీసి పెట్టె మీద గీస్తూ వెలిగించబోయాడు. మనసంతా బాధతో, ఆందోళనతో నిండిన వాడిలా వున్నాడు. రమ్మంటూ లోకనాథం చెయ్యూపి పిలిస్తే తల అడ్డంగా వూపి కాశీమజిలీ కథల్లో విధివంచితుడైన రాకుమారుడిలా కనుమరుగయ్యాడు.

‘‘పాపం అవతారం!’’ అంటూ లోకనాథం నిట్టూర్పు విడిచాడు.

‘‘అవతారమా?’’

‘‘అతని పూర్తి పేరు కనకవల్లి శేషావతారం. వాళ్ళ బాబాయి రావుబహదూర్ సోమేశ్వర్రావు మూలాన అలా డీలా పడ్డాడు.’’

‘‘ఏమైంది, చనిపోయాడా ఆయన?’’

‘‘అంత అదృష్టం లేదులెండి. రేపాయన బెజవాడ వస్తున్నాడట. అవతారానికి పొద్దున్నే ఆ వార్త చేరింది.’’

‘‘దాంతో మీవాడు తలకిందులయ్యాడా?’’

‘‘కిందటిసారి ఆయన వచ్చినప్పుడు జరిపిన భాగోతం మూలాన అలా అవడం సహజం.’’

‘‘ఏమైందేమిటి కిందటిసారి?’’

‘‘అలా అడగండి మరి.’’

‘‘అడిగానుగదయ్యా.’’

‘‘ఆహా!’’ అన్నాడు లోకనాథం.

వాళ్ళ బాబాయి (లోకనాథం చెప్పడం మొదలెట్టాడు) రావుబహదూర్ సోమేశ్వర్రావుని తలుచుకున్నప్పుడల్లా అవతారం కళ్ళల్లో నీళ్ళు చిమ్ముకొస్తాయి. ఆనంద బాష్పాలు కావచ్చని మీరంటే వొప్పుకోను. అవి నిజంగా దుఃఖం ఆపుకోలేక వచ్చే కన్నీళ్ళని బల్ల గుద్ది చెబుతా. రావుబహదూర్ సోమేశ్వర్రావుగారు ఏడాదంతా స్వగ్రామం గోసాలలో వున్నా అప్పుడప్పుడు వున్నపళాన సూటూ బూటూతో నెత్తిన హేటు పెట్టుకుని బెజవాడ వచ్చి అవతారం యింట్లో తిష్ట వేస్తుంటాడు. అలా వచ్చినప్పుడల్లా మావాడిని ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగించి నానా అవస్తలు పెడతాడు. దానికి కారణం ఆ బాబాయిగారు అరవయ్యేళ్ళ వయసుకి వచ్చినా బెజవాడకి రాగానే యింకా కుర్రాడినే, మహా అయితే యిరవై రెండేళ్ళే, వయసు మీరలేదు అన్న భ్రమలో పడిపోతాడు. ‘అతి’, ‘హద్దుమీరి’ అన్న మాటలకి మీకు అర్థం తెలుసో తెలీదో, అవతారం వాళ్ళ బాబాయి పట్నం రాగానే మితిమీరి, బరితెగించి చేసే ఆగడాలకి అర్థం అదే.

ఆయన క్లబ్బుకొచ్చి యిక్కడ యిష్టమొచ్చినట్టు ప్రవర్తిస్తే ఫరవాలేదు. మా మెంబర్లందరూ విశాల హృదయులు, పట్టించుకోరు. కప్పులు, సాసర్లు, ప్లేట్లు నేలకి విసిరేసి కొడితే కనుబొమలు పైకెత్తి నిట్టూర్చి వూరుకుంటారు. వచ్చిన చిక్కల్లా ఆయనగారు అవతారాన్ని బయటికి తీసుకెళ్ళి తనతో తిప్పుతూ అందరి ముందు విపరీతంగా రెచ్చిపోతాడు.

నేనిప్పుడు చెప్పబోయే సంఘటన జరిగిన రోజు మధ్యాహ్నం అవతారం యింట్లో భోజనం ముగించి పొట్ట రాసుకుంటూ అతనిచ్చిన సిగార్ తృప్తిగా పీలుస్తూ హాల్లో నుంచుని, ‘‘అబ్బాయవతారం, యివాళ మధ్యాహ్నం కొత్త కొత్త విషయాలు నేర్చుకుంటూ హాయిగా గడుపుదాం,’’ అన్నాడు. అది విని కళ్ళముందే డైనమైటుకి నిప్పంటుకున్నట్టు అవతారం ఆయన వంక చూశాడంటే దాంతో మీరు తెలుసుకోవచ్చు సోంబాబాయిగారి ఘనత.

మోకాళ్ళు వొణుకుతూ పాలిపోయిన ముఖంతో, ‘‘ఏమిటది?’’ అని అవతారం అడిగాడు.

''ఎ ప్లెజంట్ అండ్ ఇన్‌స్ట్రక్టివ్ ఆఫ్టర్నూన్,'' షోగ్గా పదాల్ని నాలిక మీద తిప్పుతూ మరోసారి చెప్పాడాయన. ''నువ్వల్లా చెప్పినట్టు విని ప్రోగ్రాం నాకొదిలెయ్.''

అవతారం అత్యవసర పరిస్థితుల్లో పాతికో పరకో బాబాయి నించి వసూలు చేస్తుంటాడు, అంచేత ఆయన్ని గట్టిగా ఎదిరించి మాట్లాడే స్థితిలో లేడు. ఇప్పుడు మాత్రం ధైర్యం కూడగట్టుకుని దబాయిస్తూ, ''నన్ను మీరు మళ్ళీ తిరణాలకో, జాతరకో తీసుకెళ్ళడానికి వీల్లేదు,'' అన్నాడు.

''లేదయ్యా, లేదు.''

''కిందటిసారి కార్తీకమాసంలో మీరొచ్చినప్పుడు జరిగింది గుర్తుందిగా.''

''ఓ మహబాగా గుర్తుందయ్యా. అయినా కాస్త మతి వున్న జడ్జి అయితే మందలించి వదిలేసే వాడని యిప్పటికీ నా అభిప్రాయం,'' అన్నాడు రావుబహదూర్ సోమేశ్వరావు.

''అయినా నేను...''

''అబ్బే లేదయ్యా. అలాంటి చోట్లకి కాదు. మీ తాతముత్తాలు పుట్టి పెరిగిన చోటుకి తీసుకెడదామని చూస్తున్నా.''

అవతారానికి యిదేమిటో అర్థం కాలేదు.

''మా తాతముత్తాలది గోసాల సంస్థానం కదా?''

''మన పూర్వీకులకి చెందిన ఎన్నో వాటిల్లో అది కూడా ఒకటయ్యా. కొంతకాలం కుందేరులో కూడా గడిపారు.''

''వూరికి దూరంగానా?''

''అవును, ఒకప్పుడు అంతే. ఇప్పుడు వూళ్ళన్నీ కలిసిపోయాయి. చిన్నతనంలో నేను ఆడుకున్న మైదానాలన్నీ పోయి అక్కడంతా చక్కటి యిళ్ళొచ్చాయి. నేను కూడా చూసి చాలాకాలం అయిందనుకో. మా చిన్నప్పుడు అవన్నీ చింతతోపులూ, మామిడి తోటలూను. మీ చినతాతయ్య రాజా వేంకట సూర్యదేవరావుగారివే అవన్నీ. ఇంతింత లావు మీసాలున్నా చాలా గొప్పవాడు. ఆ వూరు యిప్పుడెలా వుందో, ఏమేమి మార్పులొచ్చాయో చూడాలని చాలా రోజుల నించి కుతూహలంగా వుందయ్యా. అదో సెంటిమెంటు, అంతే. అదంతా యిప్పుడు దరిద్రంగా మారి వుండవచ్చని కూడా తెలుసు నాకు. అయినా ఓసారలా తీర్థయాత్ర చేసినట్టు వెళ్ళొద్దామంటున్నా.''

అవతారం దానికి హృదయపూర్వకంగా సమ్మతిస్తూ సంతోషంతో వొప్పుకున్నాడు. భుజం మీంచి పెద్ద భారం దించినట్టయింది. పిచ్చాసుపత్రికి బెత్తెడు దూరంలో వున్న సోంబాబాయికైనా అలాంటి కుగ్రామాల్లో ఆకతాయి పనులకి దిగే అవకాశాలు తక్కువని అతని అభిప్రాయం. మీకు తెలుసుగదండీ పల్లెటూళ్ళు ఎలా వుంటాయో, ఆయనకి అక్కడ అలాంటి అవకాశాలు బొత్తిగా దొరకవు. అవతారం అనుకున్నదాంట్లో తప్పు పట్టలేము.

''ఫైన్! బ్రహ్మాండం! ఎదురులేదు!'' అన్నాడు అవతారం.

‘‘మరైతే బట్టలు మార్చుకుని తయారవు, పోదామింక. బస్సులోనో, లారీలోనే పోవచ్చనుకుంటా అక్కడికి,’’ అన్నాడు రావుబహదూర్ సోమేశ్వర్రావు.

*

కుందేరు కుగ్రామం చూసి తనేదో మానసికంగా ఎదుగుతానని అవతారం అనుకోలేదు, జరిగింది కూడా అంతే. బస్సు దిగంగానే వరసగా అన్నీ యిళ్ళే యిళ్ళు. కాలనీలో లాగా అన్నీ ఒకే తరహాలో మూస పోసినట్టు వున్నాయవి. కొంచెం ముందుకు సాగితే మరిన్ని యిళ్ళు, అవి కూడా ఒకేలా వున్నాయని అవతారం చెప్పాడు. అయినా విసుగు పుట్ట లేదట. కాసేపటికి వున్నట్టుండి వాతావరణం చల్లబడింది. అకాలంలో కుంభవృష్టి కురిసే రోజుల్లో అది ఒకటి. గొడుగో, రెయిన్ కోటో తెచ్చుకోకపోయినా బెంగపడలేదు. గంటలు గడిచినా సోంబాబాయి తిక్క వేషాల్లోకి, చిలిపి చేష్టల్లోకి దిగ నందుకు అవతారం సంబరపడ్డాడు. ఆరోజు రాత్రి బెజవాడ తిరణాలలో పట్టుమని పది నిమిషాలన్నా గడవక ముందే పోలీసులొచ్చి యిద్దర్నీ పట్టుకుపోయారు.

అదృష్టం కలిసొస్తే అలా కాసేపు వూరంతా నిరపాయకరంగా చుట్టేసి యింటికి వెళ్ళగానే వేడివేడి డిన్నరు పెట్టించి బాబాయిని మంచం ఎక్కించాలనుకున్నాడు అవతారం. మర్నాడు మధ్యాహ్నం భోజనం టైముకల్లా యింటికి తిరిగి రాకపోతే, భార్యామణి జానకి – అవతారానికి పిన్నిగారు – మొండికత్తితో తాట వొలుస్తానని చెప్పినట్టు సోం బాబాయే ప్రత్యేకించి చెప్పాడు. అందుకని యీసారి మాత్రం ఎలాంటి ప్రాణహాని కలిగించకుండా బయటపడేలా వున్నాడనుకున్నాడు. అలా అనుకోగానే అవతారం పెదిమల మీద చిరునవ్వు తొణికిసలాడింది. ఆరోజుకు అదే అతని ఆఖరి నవ్వు అన్నది ముఖ్యంగా గమనించాల్సిన విషయం.

వాసన చూసే కుక్కలా రావుబహదూర్ సోమేశ్వర్రావు అక్కడక్కడ ఆగుతూ, యిదిగో యిక్కడే బహుశ తను వొంగుని తోటలో కలుపు తీస్తున్న మాలిని వెనకనించి వెదురు బాణంతో కొట్టుంటానని, యిక్కడెక్కడోనే మొదటిసారి ఎంగిలి సిగరెట్టు తాగి దగ్గుతో వూపిరాడక కొట్టుకున్నాననీ చెబుతూ వచ్చాడు. కాసేపాగి పెద్ద బంగళా ముందు నుంచుని చూస్తూ అకారణంగా ఆగిపోయాడు. ఆ యింటి మీద రాసున్న పేరు టేకుమళ్ళ. మృదువుగా వున్న ముఖంలో తీరని బాధ చోటు చేసుకుంది.

చిన్నగా నిట్టూర్పు విడిచి, ‘‘నాకు గుర్తున్నంతమటుకు యిదే చోట మొన్న ఉగాదికి సరిగ్గా యాభయ్యేళ్ళ క్రితం నేను ... ఛీ దరిద్రం!’’ అన్నాడు.

చివర్లో ఆయన అలా అనడానికి కారణం అప్పటిదాకా ఆగిన వర్షం వున్నట్టుండి కుండపోతలా కురవడం మొద లయినందుకు. మరో మాట మాట్లాడకుండా గేటు తెరిచి ఆ యింటి వరండాలో ఆశ్రయం తీసుకుంటూ కిటికీ లోపలి వైపు వేలాడుతున్న పంజరంలోని రామచిలకతో యిద్దరూ చూపులు కలిపారు.

నిజానికి వాళ్ళు నుంచున్న వరండాని ఆశ్రయం అనడం సరికాదు. తల తడవడం లేదన్నది తప్పించి అన్ని వైపుల నుంచి జోరుగా పడుతున్న వానలో తడిసి ముద్దయ్యారు. ఈదరగాలికి, వర్షానికి తట్టుకోలేక అవతారం కాలరు పైకెత్తి గుమ్మానికి ఆనుకోబోతుంటే భళ్ళున తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా పనిమనిషి లాంటి స్త్రీ నుంచునుంటే చూసి సోంబాబాయే డోరు బెల్లు నొక్కాడనుకున్నాడు.

పెద్ద తాటాకు గొడుగు పట్టుకుని నుంచున్న ఆవిడని ఆనందంతో చూస్తూ రావుబహదూర్ సోమేశ్వర్రావు, ''నమస్కారమమ్మా,'' అంటూ ఆదరంగా పలకరించాడు.

''నమస్తే,'' అందామె.

''టేకుమళ్ళవారి యిల్లు యిదేనామ్మా?''

అవును యిదే అందామె.

''అయ్యగారున్నారా?''

ఇంట్లో ఎవరూ లేరు అందామె.

''అవునా? అయినా ఫరవాలేదులేమ్మా. నేనొచ్చింది, అదిగో, మీ పెంపుడు చిలకుందే దాని గోళ్ళు కత్తిరించ డానికి,'' అంటూ లోపలికి దూరి అవతారాన్ని చూపిస్తూ, ''ఇతనేమో నా అసిస్టెంటు చెన్నకేశవులు. గోళ్ళు కత్తిరించే టప్పుడు ముక్కుతో పొడవకుండా ముందు దానికి మత్తు మందిస్తాడితను,'' అని చెప్పాడాయన.

''పిట్టల దుకాణం నించి వచ్చారా?''

''చక్కగా గ్రహించావమ్మా.''

''మీరొస్తున్నట్టు ఎవరూ చెప్పను కూడా లేదే?''

రావుబహదూర్ సోమేశ్వర్రావు సానుభూతిగా, ''ఓహో, విషయాలేవీ చెప్పకుండా నీనుంచి దాచిపెడుతున్నారా వీళ్ళు? ఇదేం బాలేదమ్మా,'' అన్నాడు.

అలా అని పూర్తిగా లోపలికి చొచ్చుకుంటూ వెళ్ళాడాయన. నిద్రలో నడిచే వాడిలా అవతారం వెనకాలే పోతుంటే అతని వెనకాలే పనిమనిషి వచ్చి, ''సరే, ఫరవాలేదనుకుంటా. ఇప్పుడే యింటికి బయల్దేరుతున్నా, పెళ్ళికెళ్ళాలి,'' అని చెప్పిందామె.

''వెళ్ళమ్మా, వెళ్ళు. అలాంటివాటికి తప్పకుండా హాజరవ్వాలి. ఎక్కడి వస్తువులక్కడే వుంచి పనయిపోగానే మా దారిన మేము వెడతాం, దిగులు పడకమ్మా,'' అని సమాధానపరుస్తూ చెప్పాడాయన.

సందేహిస్తూనే వెళ్ళిందామె. రావుబహదూర్ సోమేశ్వర్రావు జోరుగా ఫ్యాను వేసుకుని దాని కిందికి కుర్చీ లాక్కుని వొంటికి అతుక్కున్న తడి బట్టలు ఆరబెట్టుకుంటూ కూచున్నాడు.

''అబ్బాయ్ అవతారం, చూశావా, హాయిగా పొడి చోట తల దాచుకున్నాం. కావలిసిందల్లా కొంచెం బుద్ధి కుశ లత, మరికాస్త చురుకుదనమేనయ్యా. వానలో తడిసి జలుబు భారం చెయ్యకుండా యిప్పుడు ఎంత సుఖంగా వున్నామో చూడు. నువ్వు కనక అన్ని విషయాలు నాకొదిలేస్తే చెడు ఎప్పటికీ జరగదోయ్,'' అన్నాడు.

''బానేవుంది కానీ యిక్కడే పాతుకుపోలేం కదా,'' అన్నాడు అవతారం.

సోంబాబాయి కనుబొమలు పైకి లేచాయి.

''అదేమిటి, వుండకూడదా యిక్కడ? బయటికి పోయి వానలో తడిసి ముద్దవ్వాలంటావా? నాయనా, దానివల్ల వచ్చే ఈతిబాధలు నీకు తెలీవు. ఇంటినించి పొద్దున బయల్దేరుతున్నప్పుడు నాకూ, మీ పిన్నికీ చిన్న గొడవైంది. ఆవిడ గారేమో వాతావరణం బాలేదు, స్వెట్టరు, మఫ్లరు తీసుకెళ్ళమని మంకుపట్టు పట్టింది. నేనేమో వాతావరణం చాలా చక్కగా వుంది, స్వెట్టర్లు, మఫ్లర్లు మోసుకెళ్ళనని వాదించా. చివరికి నా పంతమే నెగ్గింది. ఇప్పుడు కనక వానలో తడిసి జ్వరమో, న్యుమోనియానో తెచ్చుకుంటే నా పరిస్థితి ఎలా వుంటుందో కాస్త ఆలోచించు. పనికిరాని దద్దమ్మవి అని ఆవిడ చేత అనిపించుకుంటా. పైగా వచ్చేమారు స్వెట్టర్లు, మఫ్లర్లు కాక రగ్గులు, రజాయిలు మోసుకెళ్ళమంటుంది మీ పిన్ని. లేదయ్యా, యిక్కడే వుండి పొయ్యి వెలిగించి కాస్త వొళ్ళు కాచుకుంటా. వేడివేడి పొయ్యి దగ్గిర కూచుంటే వొళ్ళంతా వెచ్చబడుతుందోయ్.''

అవతారం పరిస్థితి కూడా అలానే వుంది. తప్పు చేస్తున్నందుకు నుదుటి మీద చెమట బిందువులు చేరు కున్నాయి. అతను లా డిగ్రీ చేస్తున్నాడు. ఇంకా ఇండియన్ పీనల్ కోడ్ పూర్తిగా వంటబట్టించుకోకపోయినా, ముక్కూ మొహం తెలియని వాళ్ళ యింట్లోకి పెంపుడు పక్షి గోళ్ళు కత్తిరించడానికి వచ్చామంటూ చొరబడటం – శిస్తులు కట్టక పోవడం, తగవులాడటం లాంటిది కాకపోయినా, అది – నేరం కింద, అనుచిత కార్యం కింద వస్తుందన్న గ్రహింపు వుంది. నేరం సంగతెలా వున్నా ప్రస్తుత పరిస్థితి కలవరపరిచింది. ఎప్పుడూ సూటిగా ప్రవర్తించే నియమాలున్న అవ తారానికి యిదంతా అసహ్యంగా తోచి కింది పెదిమ కొరుక్కున్నాడు, ముందు చెప్పినట్టు వొళ్ళంతా ముచ్చెమటలు పోశాయి.

''ఈ దరిద్రపుగొట్టు యింటి యజమానిగాడే వస్తే మనమేం చెయ్యాలి బాబాయ్? కాస్త వెనకా ముందు ఆలో చించండి,'' అన్నాడు అవతారం.

ఆ మాట అన్నాడో లేదో డోరు బెల్లు మోగనే మోగింది.

''అదిగో!'' అన్నాడు అవతారం.

''అబ్బాయ్, వూర్కే 'అదిగో!' అంటూ కూచోకు,'' అని రావుబహదూర్ సోమేశ్వర్రావు మందలించాడు. ''మీ పిన్ని కూడా అస్తమానం యిలానే అంటుంది. ఏదో ముంచుకొస్తుందని భయపడేందుకు నాకేమీ కారణం కనిపించడం లేదు. ఆనవాయితీగా వస్తుండే వాడెవడో అయుంటాడు. ఇంటి వాళ్ళే అయితే తలుపు తోసుకుంటూ లోపలికొస్తారు, బెల్లు కొడుతూ కూచోరు. బయట ఎవరున్నారో కిటికీలోంచి తొంగి చూసి కనిపెట్టు.''

చెప్పిన పని చేసి, ''ఎవరో ఎర్రటి పడుచు కుర్రాడు,'' అన్నాడు అవతారం.

''ఎంత ఎరుపు?''

''ఎర్రటి ఎరుపు.''

''చూశావా మరి, నేను చెప్పినట్టే అయిందా లేదా? వాడీ యింటి యజమాని కానేకాదు. ఇలాంటి యింటి యజమాని – భూస్వామి. పొద్దస్తమానం చేలల్లో తిరగడంతో నల్లగా, ముదురుగా వుండాలి. ఎందుకొచ్చాడో, ఏం కావాలో కనుక్కో.''

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Saradaga+Marikontasepu**

* * *